క్లుప్తంగా

వాహనాల తనిఖీ

మద్నూర్(జుక్కల్): సలాబత్‌పూర్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరి కంటే మించి ప్రయాణిస్తున్న వారిని హెచ్చరించారు. మద్యం, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలలో ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని వాహనదారులకు సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రజాప్రతినిధులు, నాయకులు



బాన్సువాడ: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత మొదటి సారి బాన్సువాడకు వచ్చిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కుల సంఘాల సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, ప్రజా సేవనే నేడు మళ్లీ అసెంబ్లీకి పంపించేలా చేసిందని ఎమ్మెల్యే అన్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మత్తమాల పీహెచ్‌సీలో గర్భిణులకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు ప్రతి నెలా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. హిమోగ్లోబిన్ 11 శాతానికి తగ్గకుండా ప్రతి రోజు కాల్షియం, ఐరన్ మాత్రలను వేసుకోవాలని అన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు



ఎల్లారెడ్డి: పట్టణంలోని ఇటుక బట్టీల వద్ద పని చేస్తున్న ముగ్గురు బడి బయట పిల్లలను గుర్తించినట్లు సీఆర్‌పీ మహేష్ తెలిపారు. బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించినట్లు ఆయన చెప్పారు. 18 ఏళ్ల లోపు చిన్నారులకు బడికి పంపాలని తల్లిదండ్రులకు సూచించామన్నారు.

జాతీయ లా ప్రవేశపరీక్షలో భిక్కనూరు విద్యార్థికి 504 ర్యాంక్



భిక్కనూరు: జాతీయ కామన్ న్యాయశాస్త్ర ప్రవేశపరీక్ష -2024లో భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని పెద్దబచ్చగారి శివాని రెడ్డి జాతీయ స్థాయిలో 504 ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 15వ ర్యాంక్ సాధించారు. సోమవారం వెలువడిన ఫలితాల్లో శివాని రెడ్డి ఈ ర్యాంకులను సాధించింది. భిక్కనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు శివాణీ రెడ్డి చదివారు. నల్సార్ లా యూనివర్సిటీలో ప్రవేశం పొందాలనుకుంటున్నట్లు ఆమె తెలిపారు. పలువురు అభినందించారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేయండి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్‌ను కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్, డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మితో పాటు ఆస్పత్రి బృంద సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యేను కోరారు.

పుస్తకాల పంపిణీ



కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు సుమారు రూ.50 వేల విలువ గల 'ఆల్ ఇన్ వన్' పుస్తకాలను 12వ వార్డు కౌన్సిలర్ కాసర్ల గోదావరి స్వామి తన సొంత ఖర్చులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. ఉచితంగా అందించిన పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాగా చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగా కిషన్, స్థానిక వార్డు ప్రజాప్రతినిధులు శశిధర్ రావు, ద్యావరి నరేష్, కాసర్ల నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను అందుబాటులోకి తీసుకొస్తాం

- సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తాం
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు



తాండూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాపాలనను అందుబాటులోకి తీసుకొస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత తొలిసారిగా నాగిరెడ్డిపేట మండలానికి వచ్చిన ఆయన సోమవారం తాండూర్ శివారులోని త్రిలింగ రామేశ్వరాలయంలో జరిగిన లక్షపుష్పార్చనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులతో కలిసి తాను కూడా ప్రజల వద్దకే వెళ్తానన్నారు. దీంతోపాటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజల సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులను కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్లో నమోదు చేస్తామన్నారు. తమ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన నేపథ్యంలో నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో శిథిలావస్థకు చేరిన ఆర్టీసీ బస్టాండ్‌కు మరమ్మతులు చేయిస్తామన్నారు. అలాగే నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల రైతులకు జీవనాధారమైన పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ మరమ్మతు కోసం నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని వివరించారు. మహిమా నిత్య పుణ్యక్షేత్రంగా పేరొందిన తాండూర్ త్రిలింగ రామేశ్వర ఆలయ అభివృద్ధికి దేవాదాయశాఖ ద్వారా ప్రత్యేకంగా నిధులు కేటాయించేలా చర్యలు చేపడతానని తెలిపారు. ఆయనవెంట నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, ధర్మారెడ్డి సర్పంచ్ శ్రీధర్‌గౌడ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు షాహెద్, నాయకులు విఠల్‌రెడ్డి, రాంచందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తాడ్వాయి నేతలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో సోమవారం నూతనంగా ఎన్నికైన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు జంగం రాజు, సుగుణాకర్‌రెడ్డి, శ్యాంరావు, షౌకత్‌అలీ, శ్రీకాంత్, అశ్వక్, బాలకిషన్‌రావు, లింగం, నారాయణరెడ్డి, భాస్కర్, తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

లింగంపేట కాంగ్రెస్ నేతలు..



లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావును లింగంపేట కాంగ్రెస్ నేతలు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించి మండల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. జొన్నల రాజు, ఫతియోద్దీన్, ఇమామ్, శ్రీనివాస్, మహేష్, చారి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ ఇక్కట్లు



మాచారెడ్డిలో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన మహిళలు



లింగంపేటలో..

మాచారెడ్డి: గ్యాస్ వినియోగదారులకు ఈ-కేవైసీ చేయించుకుంటేనే రూ. 500 వంట గ్యాస్ పథకం అమలు అవుతుందని ప్రచారం కావడంతో గ్యాస్ ఏజెన్సీల వద్ద మహిళలు బారులు తీరి నానా ఇక్కట్లకు గురవుతున్నారు. మాచారెడ్డి చౌరస్తాలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఎదుట ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్‌లో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

లింగంపేటలో వేలిముద్రల సేకరణ

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరి నుంచి ఆన్‌లైన్ బయోమెట్రిక్(వేలిముద్రలు) సేకరిస్తున్నట్లు భారత్ గ్యాస్ నిర్వాహకులు తెలిపారు. గ్యాస్ కనెక్షన్ ఉన్న వారు ఆధార్ కార్డు, గ్యాస్ బుక్కు తీసుకొని కార్యాలయానికి వచ్చి ఈ-కేవైసీ చేయించుకొని వెళ్లాలన్నారు. లబ్ధిదారులు ఆందోళన చెందకుండా తాము కేటాయించిన తేదీలలో సూచించిన గ్రామాల వారు మాత్రమే కార్యాలయానికి రావాలన్నారు. ఈ నెల 31 వరకు సమయం ఉందన్నారు.



గోపాల్‌పేటలోని భారత్ గ్యాస్ కార్యాలయం వద్ద బారులు తీరిన మహిళలు

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న మండల నోడల్ అధికారి షౌకత్

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించి విద్యా ప్రమాణాలను పెంపొందించాలని మండల నోడల్ అధికారి షౌకత్ అలీ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రైమరీ లెవల్ కాంప్లెక్ సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు తరగతి గదిలో బోధనోపకరణాలు ఉపయోగించి విద్యా బోధన చేయాలన్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం రాయడం నేర్పాలన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతీ పిల్లవాడు బడిలో ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు బడి మధ్యలో మానకుండా ఉండేందుకు ఎస్‌ఎంసీ సమావేశాలు నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్‌రావు, కార్యదర్శి రాములు, రవీందర్ శర్మ, సీఆర్పీ గంగాధర్ పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న బీజేపీ నేతలు



పూజలు చేస్తున్న బీజేపీ నేతలు

భిక్కనూరు: కామారెడ్డి ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి విజయం సాధిస్తే తిప్పాపూర్ వేంకటేశ్వరాలయంలో తలనీలాలు సమర్పిస్తానని మొక్కుకున్న బీజేపీ నేతలు సోమవారం తమ మొక్కును చెల్లించుకున్నారు. బీజేపీ కామారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి సోమవారం తిప్పాపూర్ గ్రామానికి వచ్చి ఆలయంలో స్వామివారికి తలనీలాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నేతలు నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, గణేశ్‌రెడ్డి, సిద్ధారెడ్డి, నర్సారెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు



మాట్లాడుతున్న హన్మంత్‌రెడ్డి

భిక్కనూరు: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో రైతులకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. సోమవారం భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో నిర్వహించిన పాలక మండలి సమావేశానికి హన్మంత్‌రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్ సహకారంతో రెండేళ్లుగా రైతులకు ఎన్నో సేవలను అందించామన్నారు. మార్కెట్ కమిటీ ప్రాంగణంలో రూ.45 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. నూతనంగా బోర్ బావిని తవ్వించి రైతులకు నీటి ఎద్దడి లేకుండా చేయాలని తీర్మానించారు. మార్కెట్ కమిటీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్నందున నూతన భవనం నిర్మించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు.

గిరిజనులను అవమానిస్తే సహించం



మాచారెడ్డిలో మాట్లాడుతున్న గిరిజన నేతలు

మాచారెడ్డి: గిరిజనులను అవమానిస్తే సహించేది లేదని కాంగ్రెస్ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు నాసీలాల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడారు. ఎవరో నాయక్ మాజీ మంత్రి షబ్బీర్ అలీ వద్ద టీలు, నీళ్లు మోస్తూ విద్యుత్ శాఖలో రూ.2 కోట్ల అవినీతికి పాల్పడ్డారని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడడం విడ్డూరమన్నారు. అలా మాట్లాడడం మంచిది కాదని విమర్శించారు. నాయక్ అని సంబోధిస్తూ మాట్లాడడం మా జాతిని అవమానించినట్లు అవుతుందన్నారు. బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన నేతలు సదార్ నాయక్, శంకర్ నాయక్, తిరుపతి నాయక్, తదితరులు ఉన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి



మాట్లాడుతున్న డీపీఎం రమేశ్ బాబు

రాజంపేట: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఐకేపీ డీపీఎం రమేశ్ బాబు అన్నారు. సోమవారం రాజంపేట మండలం బస్వన్నపల్లిలో గ్రామ సంఘ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బ్యాంకు ద్వారా అందించే రుణాలతో మహిళా సంఘ సభ్యులు ఫిష్‌పాండ్, మగ్గంవర్క్ టైలరింగ్, మహాలక్ష్మి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షులు లక్ష్మి, రాధ, కోశాధికారి లావణ్య, ఏపీఎం సాయిలు పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి

- ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం సరస్వతి
- కామారెడ్డి ఆర్టీసీ డిపో సందర్శన



మాట్లాడుతున్న డిప్యూటీ ఆర్‌ఎం సరస్వతి

కామారెడ్డి టౌన్: ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా పలకరించాలని ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ సరస్వతి సూచించారు. సోమవారం కామారెడ్డి ఆర్టీసి డిపోను ఆమె సందర్శించారు. బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహాలక్ష్మి పథకంపై డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. డిపో మేనేజర్ ఇందిర తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి





మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు... ఎస్పీ సింధు శర్మకు అందజేస్తూ..

నిజాంసాగర్(జుక్కల్): రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జుక్కల్ నియోజకవర్గంలోని మారుమూల ప్రాంత గ్రామాల రోడ్లకు అటవీ శాఖ అనుమతులతో పాటు అభివృద్ధికి నిధులు ఇవ్వాలని మంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కలెక్టర్, ఎస్పీ..

నిజాంసాగర్(జుక్కల్): జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ సింధు శర్మను సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం అధికారులను కలిశారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన షబ్బీర్ అలీ



భట్టిని సన్మానిస్తున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ని శాలువాతో సత్కరించారు.

సంతలో జోరుగా నారు విక్రయం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం గోపాల్‌పేటలో సోమవారం జరిగిన వారాంతపు సంతలో ఉల్లి, టమాట, మిరప నారును జోరుగా విక్రయించారు. రూ.50-రూ.100కు నారును విక్రయించారు. వానాకాలం సాగు పూర్తికావడంతో రైతులు ఉల్లి, టమాట, మిరప పంటను సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో సంతలో నారును కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ

బాన్సువాడ రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల సామాజిక తనిఖీ కొనసాగుతోంది. 2022 -23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులను ఆడిట్ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాయి. చేసిన పేమెంట్‌కు సరిపడా కొలతలను రికార్డులతో సరి చూస్తున్నారు. ప్రతి ఏటా సామాజిక తనిఖీ సమాచారాన్ని మండల అధికారులు మీడియాకు వెల్లడించేవారు. ఈసారి ఆడిట్ గోప్యంగా సాగుతుండటంపై అవకతవకలు జరిగాయేమోననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన చౌహాన్ రాజుకు సెల్ ఫోన్‌ను అందించినట్లు ఎస్సై గణేష్ సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన రాజు తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి ఫోన్‌ను అందించడం జరిగిందన్నారు.

పిల్లల హాజరును రోజూ నమోదు చేయాలి



మాట్లాడుతున్న మండల విద్యాధికారి దేవిసింగ్

పిట్లం(జుక్కల్): ప్రభుత్వ పాఠశాలలో ముఖ గుర్తింపు యాప్ ద్వారా పిల్లల హాజరు ప్రతి రోజు నమోదు చేయాలని మండల విద్యాధికారి దేవిసింగ్ పేర్కొన్నారు. రాంపూర్‌లో సోమవారం ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. నోడల్ అధికారి రమణారావు మాట్లాడుతూ.. కాంప్లెక్స్ పరిధిలోని ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలకు సంబంధించి తరగతులు, సబ్జెక్టుల వారీగా అలైన్మెంట్ సిద్ధం చేసుకోవాలని, ప్రత్యేక యాప్‌లో పిల్లల ప్రగతి రిపోర్ట్ మొదలైన వివరాలను నెలల వారీగా ఆన్‌లైన్లో నమోదు చేయాలని సూచించారు. కాంప్లెక్స్ ఇన్‌చార్జి విఠల్, సెక్రటరీ నార్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ గోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి తదితరులు

బాన్సువాడ: బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి-కవిత ల స్వగృహం నుంచి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు తీసుకుని అయ్యప్ప ఆలయానికి తీసుకువచ్చి శివపార్వతుల కల్యాణం చేశారు. భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కల్యాణోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సమాజం శాంతి మార్గంలో నడవాలంటే గుడులు, గోపురాలు నిర్మించాలని, భక్తి మార్గం వేరు రాజకీయం వేరు అని, రాజకీయ నాయకుడు పవిత్రంగా ఉంటే దేవుడు దీవిస్తాడని అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమాచారం..

రేపు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

బాన్సువాడ: బాన్సువాడలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్ తెలిపారు. సోమేశ్వర్ చౌరస్తా వద్ద ఉన్న ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్నారని ఆయన అన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

14న మండల సభ

మాచారెడ్డి: మాచారెడ్డి మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 14న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణ సోమవారం తెలిపారు. ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న మండల సభకు ప్రజాప్రతినిధులు అధికారులు హాజరు కావాలని కోరారు.

వేంకటేశ్వర ఆలయంలో పోచారం పూజలు

బాన్సువాడ : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. శాసన సభ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. బీర్కూర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు వచ్చి ఆలయంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం చేశారు.

